ప్రజాశక్తి

ఆదివారం 12 నవంబర్ 2023

బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన స్నేహ ప్రత్యేక సంచికను బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది ఎస్.పోలినాయుడు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

-ప్రజాశక్తి, పార్వతీపురంరూరల్

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- బయటకు రానివ్వకుండా చక్రం తిప్పిన ఎంఇఒ?
- విచారణ చేపట్టిన విద్యా శాఖ అధికారులు

పాఠశాలలో విచారణ చేపడుతున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, పూసపాటిరేగ

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు విద్యార్థినులపై లైంగిక వేదింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం ఎంపియుపి పాఠశాలలో పని చేస్తున్న శంకర్ నాయుడు అనే ఉపాధ్యాయుడు విద్యార్థినులపట్ల లైంగిక వేదింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే విషయమై మండల విద్యాశాధికారులకు కూడా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన గత మంళవారం జరగ్గా విషయం బయటకు రాకుండా గ్రామస్థులతో రహస్య మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. విద్యార్థిని తల్లిదండ్రులను, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన యువకులను అదే ఊరిలో ఓ ఇంటిలో సమావేశపరిచి విషయం బయటకు రాకుండా ఆ ఉపాధ్యాయుడ్ని కాపాడే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. శనివారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారులకు విషయం తెలియడంతో ఉపాధ్యాయుడి తీరుపై విద్యాశాఖ కార్యలయంలో చర్చకు దారితీసింది.

చక్రం తిప్పిన ఎంఇఒ?

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాల్సిన ఎంఇఒ రాజ్‌కుమార్ విషయం బయటకు రాకుండా చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. విద్యార్థినులు, తల్లిదండ్రులు మంగళవారం మండల విద్యాశాధికారికి ఫిర్యాదు చేయగా, రాత పూర్వక ఫిర్యాదు తీసుకోకుండా తాను వచ్చి చూస్తానని చెప్పి తల్లి దండ్రులకు నచ్చచెప్పి స్కూలు సమయం అయిన తర్వాత ఆ గ్రామానికి వెళ్లి ఓ ఇంట్లో తల్లి దండ్రులను, పెద్దలను , ఉ పాధ్యాయుడిని కూర్చోబెట్టి చర్చించినట్లు తెలిసింది. ఉపాధ్యాయుడిని మందలించి. తల్లిదండ్రులను ఒప్పించి గొడవ సద్దుమణిగేలా ఎంఇఒ చక్రం తిప్పినట్లు తెలిసింది. ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిన అధికారి ఈ విధంగా వ్యవహరించడం పట్ల కొంత మొత్తం చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ చేపట్టిన విద్యా శాఖ అధికారులు..

విద్యార్థులపై ఉపాధ్యాయుడు శంకరనాయుడు లైంగిక వేదింపులకు పాల్పడిన ఘటనపై డిఇఒ లింగేశ్వరరెడ్డి స్పందించి విచారణకు ఆదేశించారు. గ్రామంలో విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వాలని పూసపాటిరేగ హెచ్‌ఎం శంకరావుకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఆయన శనివారం పాఠశాలకు చేరుకొని హెచ్‌ఎం వై. జయంతిమాలతో పాటు ఉపాధ్యాయులను, గ్రామంలో ఫిర్యాదుదారులను, ఎస్ఎంసి చైర్మన్ పైడిరాజును, సర్పంచి కొత్తకోట శ్రీరాములును పాఠశాలకు పిలిపించి విచారణ చేసారు. ఉపాధ్యాయుడిపై వచ్చినవి ఆరోపణలు కాదని, వాస్తవంగా జరిగిందని ఎంఇఒకు ఫిర్యాదు చేసామని గ్రామస్తులు తెలిపారు.

బ్యాడ్ టచ్, గుడ్ టచ్ ఏదో తెలియని విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నది వాస్తవమని తెలిపారు. అయితే లైంగికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులను మీ ముందుకు తీసుకురాలేమని, అవసరమైతే ఒక్కొక్కరిని మీ ముందు ఉంచే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇలాంటి విషయాలు బయటకు రాకూడదని ఉద్దేశంతోనే ఎంఇఒకు కూడా ఓరల్‌గా ఫిర్యాదు చేసామన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పేరెంట్ మీటింగ్ పెట్టామని ఎస్ఎంసి చైర్మన్ పి.పైడిరాజు తెలిపారు. ఈ విషయం బయటకు రాకూడదనే ఉద్దేశంతో గ్రామ సర్పంచికి కూడా చెప్పలేదన్నారు. ఈ విషయం తెలిస్తే మిగతా తల్లిదండ్రులు పిల్లలను మాన్పిస్తారని ఆవేదన వ్యక్తం చేసారు. సర్పంచి శ్రీరాములు స్పందించి ఇకపై ఇలాంటి చెడ్డపనులు చేసి మా ఊరుకు, ఉపాధ్యాయ వృత్తికి మచ్చతేవొద్దని హెచ్చరించారు. నివేదికను డిఇఒకు పంపుతామని హెచ్‌ఎం తెలిపారు.

మొదటి నుంచి వివాదాస్పదుడే?

శంకర్ నాయుడు మొదటి నుంచి వివాస్పదుడుగానే ముద్ర పడ్డాడు. విజయనగరం కెఎల్ పురంలో ఉంటున్న ఆయన గతంలో సాధారణ ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీకి మద్దతిచ్చి ఎన్నికల్లో బాహటంగానే తిరిగి విద్యాశాఖనుంచి మోమో అందుకున్నారు. గంట్యాడ మండలంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన సమయంలో ఎంఇఒ సంతకం ఫోర్జరీ చేశాడు. ఆయన ఎక్కడి పని చేస్తే అక్కడ వివాదాలు తెచ్చుకోవడం పరిపాటిగా మారింది.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి - సీతంపేట

విశాఖ రేంజ్ పరిధిలో శాంతి భద్రతల పరి రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు రేంజ్ డిఐజి ఎస్.హరి కృష్ణ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. సమస్యాత్మక గ్రామాలను ఇప్పటికే పోలీసులు దత్తత తీసుకున్నారని, ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే ఎస్సై పోస్టులు రిక్రూట్మెంట్ జరిగిందని, ఖాళీ ఉన్న కానిస్టేబుల్ పోస్టులు త్వరలో భర్తీ చేస్తున్నామన్నారు. అలాగే రేంజ్ పరిధిలో పోలీస్ క్వార్టర్స్‌కు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, సిఐ మురళీధర్, సీతంపేట, బత్తిలి ఎస్సైలు నీలకంఠ రావు, అమ్మన్నరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : నీలకంఠాపురం పోలీసు స్టేషన్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న డిఐజి హరికృష్ణ

కురుపాం : మండలంలోని నీలకంఠాపురం పోలీస్ స్టేషన్‌ను డిఐజి ఎస్.హరికృష్ణ అకస్మికంగా సందర్శించి స్టేషన్‌లో గల రికార్డులన్నీ పరిశీలించి అనంతరం మొక్కను నాటారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ ఏజెన్సీలో ఉన్నటువంటి పోలీస్ స్టేషన్ కనుక ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది అంత అప్రమత్తంగా ఉంటూ ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ, డిఎస్‌పితో పాటు సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ డి.అనిల్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

వైసిపితో సామాజిక న్యాయం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసిలకు వైసిపి ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం జరిగిందని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రివర్గంలో 25మంది మంత్రులు ఉంటే వారిలో 17మంది ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలేని చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా దళిత, గిరిజన ఎమ్మెల్యేలకు డిప్యూటీ సిఎం లాంటి ఉన్నత స్థాయి పదవులు కట్టబెట్టిన ఘనత సిఎం జగన్ దేనని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి చంద్రబాబు నాయుడు జీవో నెంబర్ 97 జారీ చేస్తే ముఖ్యమంత్రి జగన్ రద్దు చేశారని చెప్పారు.రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా మేలు జరిగిందని, తద్వారా వారి జీవన ప్రమాణం పెరిగిందని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు ఇవ్వాల్సి వచ్చిందని ఆరోపించారు. కుల, వృత్తి, రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు త్వరితగతిన జరిగేలా చూస్తున్నామని చెప్పారు. వైసిపికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టిడిపి నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వారికి మళ్లీ బుద్ధి చెపుతారని అన్నారు.

ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టరేట్ ఎఒ ఉమామహేశ్వరరావు, మైనార్టీ ప్రతినిధులు

ఇజ్రాయిల్ దాడులను ఖండించండి

ప్రజాశక్తి - పాచిపెంట

పాలస్తీనాపై ఇజ్రాయిల్ అత్యంత పాశవికంగా దాడులు నిర్వహిస్తుందని, ఈ దాడుల్లో అనేక మంది పాలస్తీనియన్లు మృత్యువాతపడుతున్నారని, తక్షణమే ఈ దాడులను నిలిపివేయాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యాన శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈశ్వరరావు, సిహెచ్ పోలిరాజు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు మోడీ ప్రభుత్వం మద్దతు పలకడం దారుణమని అన్నారు. పాలస్తీనా భూభాగం ఆక్రమించుకోవడానికి ఇజ్రాయిల్ చేసిన దాడులను ప్రపంచ దేశాలన్నీ ఖండించగా, మోడీ ప్రభుత్వం అమెరికా అండతో ఇజ్రాయులకు మద్దతు ఇస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయాల ప్రకారం పాలస్తీనా భూభాగాల నుండి ఇజ్రాయిల్ పూర్తిగా వైదొలగాలని కోరారు. అమెరికా, బ్రిటన్ దేశాలు ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకొని యుద్ధాన్ని సృష్టించి వేలాదిమంది పాలస్తీయన్ల మరణానికి కారణమయ్యారని ఆందోళన వ్యక్త ంచేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం దాడులను ఖండించకుండా ఇజ్రాయిల్ ప్రభుత్వానికి అండగా నిలవడం సరైనది కాదన్నారు. ఇంత దుర్మార్గంగా పాలస్తీనా ప్రజలను ఊచకోతకోస్తున్న ఇజ్రాయిల్‌కు అండగా ఉన్న మోడీ ప్రభుత్వం నిర్ణయాలను వెనక్కి తీసుకొని ఐక్యరాజ్యసమితి చెప్పిన సూచనలు పాటిస్తూ శాంతిని నెలకొల్పాలని, ఈ దాడులను ఖండించాలని అన్నారు. భారతదేశ ప్రజానీకమంతా పార్టీలకతీతంగా పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని వారిని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పల్లి ధనరాజు, ఆకుల శ్రీనివాసరావు, పి.వసంత, కొటికి పెంట మాజీ సర్పంచ్ అంబురాజు పాల్గొన్నారు.

జాతీయ ఆదివాసీ సదస్సుకు రాజన్నదొరకు ఆహ్వానం

ప్రజాశక్తి - సాలూరు

భగవాన్ బిర్సా ముండా 149వ జయంతి సందర్భంగా ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ ఆదివాసీ సదస్సు, సాంస్కృతిక కళా ప్రదర్శనకు హాజరు కావాలని కోరుతూ డిప్యూటీ సిఎం రాజన్నదొరకు పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం ఎజెఎసి మన్యం జిల్లా అధ్యక్షుడు కొండగొర్రి ధర్మారావు, ఉపాధ్యక్షులు కొండగొర్రి సుందరరావు, మజ్జి నారాయణరావు, కార్యదర్శి ఎస్.జయసింహ డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. పాడేరులోని వీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న ఆదివాసీ సదస్సుకు నేపాల్ ఆదివాసీ సమస్యల శాశ్వత ఫోరమ్ సభ్యులు పూల్మన్ చౌదరి విశిష్ట అతిథిగా, మహారాష్ట్రకు చెందిన గోండ్ రాజా వీరేంద్ర షా ఆత్రం గౌరవ అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు హాజరు కావాలని రాజన్నదొరను ఎజెఎసి నాయకులు కోరారు.

రాజన్నదొరను ఆహ్వానిస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

ఘనంగా ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనాబ్ మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి పురస్కరించుకొని మైనారిటీ వెల్ఫేర్ డే, జాతీయ ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం అజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎం.ఉమామహేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్ శ్రీరామ్మూర్తి, మైనారిటీ ప్రతినిధి మహమ్మద్ అబ్దుల్ ఖుదుష్, క్రిస్టియన్ ప్రతినిధులు బిషప్ ఎన్. తిమోతి, ఎన్. సుధీర్ చంద్ర, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో మొట్టమొదటి భారతీయ విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను కొనియాడారు. జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా మొదటి ప్రభుత్వంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేశారని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ప్రముఖుడని చెప్పారు. 11 ఏళ్ల పాటు ఆయన జైలు శిక్ష కూడా అనుభవించారన్నారు. ఆయన సేవలు భావితరాలకు ఆదర్శప్రాయమని సాయి శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో మౌలం అబుల్ కలం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొండ్లపాడులో జనసేన నాయకులు ఎం.పుండరీకం, జనసేన జానీలు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

టిఆర్ఎన్‌వలసలో ఏనుగుల తిష్ట

ప్రజాశక్తి -గరుగుబిల్లి

కొమరాడ, జియ్యమ్మవలస మండలాల నుంచి తరలివచ్చిన ఏనుగులు గడిచిన కొద్ది రోజుల నుంచి గొట్టివలస, దళాయివలస పరిసర ప్రాంతాల్లో సంచరించిన ప్రస్తుతం తులసిరామినాయుడువలస సమీపాన గల మామిడి తోటను ధ్వంసం చేస్తున్నాయి. అలాగే శనివారం మధ్యాహ్నం పార్వతీపురం - గరుగుబిల్లి ఆర్ అండ్ బి రహదారి పక్కన ఏనుగులు సంచరిస్తూ ఉండడంతో వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తులసిరామినాయుడువలస సమీపంలో గడిచిన కొద్ది రోజుల నుంచి ఏనుగులు సంచరిస్తుండంతో గ్రామస్తులు బిక్కుబిక్కు మంటున్నారు. రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై ఉంటున్న ఏనుగులు తెల్లవారిన అనంతరం సమీపంలోని కొండ వద్దకు, అలాగే తోటల్లోకి వెళుతున్నాయి. ఏనుగులు ప్రస్తుతం సంచరిస్తుండంతో తులసిరామినాయుడువలస, దలాయివలస, గొల్లవానివలస, తదితర గ్రామాలకు చెందిన రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఒంటిరి ఏనుగుతో అప్రమత్తం

తులసిరామినాయుడువలసలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

పార్వతీపురంరూరల్ : గత వారం రోజులుగా ఒడిశాలో ఉన్న ఒంటరి ఏనుగు హరి మరో రెండు రోజుల్లో తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కావున ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల గ్రామాలు చాలా జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ఏడు ఏనుగుల గుంపు ప్రస్తుతం తులసీరాంనాయుడువలస వద్ద ఉందని, చుట్టుపక్కల గ్రామాలైన ద్వైవియాస, ఉద్దవోలు, బురద వెంకటాపురం, గొల్లవానివలస, గొట్టివలస, సీమలవాణివలస, ఉల్లిభద్ర, మరిపెంట, సంభానవలస, ఈరనగుడి గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. దీపావళి సందర్భంగా ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో అధిక శబ్దాలు చేసే బాంబులను ఉపయోగించొద్దని అటవీ శాఖ గ్రామస్తులను కోరింది. రాత్రి 8 గంటల్లోపు బాణాసంచా కాల్చడం పూర్తి చేయాలని, ఈ బాంబులను ఉపయోగించి ఏనుగులను ఎవరూ ఆటపట్టించకూడదని, హాని చేయకూడదని సూచించారు. అలాగే చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏనుగు ఆచూకీ, ఇతర సమాచారం కోసం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణారావు 8790418918, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణారావు 9493399467 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

'మాదిగల సదస్సుకు ప్రధాని హాజరవడం సిగ్గుచేటు'

సాలూరు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మాదిగల సదస్సుకు ప్రధాని మోడీ హాజరవ్వడం సిగ్గుచేటని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంప ప్రకాశరావు అన్నారు. శనివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ దేశంలో మెజారిటీ రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయని సాక్షాత్తు మోడీ ప్రభుత్వంలోని సామాజిక న్యాయ శాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే పార్లమెంటులో చెప్పారని తెలిపారు. కేవలం ఓట్లు కోసం ప్రధాని మోడీ మాదిగల సదస్సుకు హాజరు కావడం సిగ్గుచేటని ప్రకాశరావు చెప్పారు.

పథకాల ముసుగులో పార్టీ ప్రచారమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాల ముసుగులో పార్టీ ప్రచార పర్వానికి తెరలేపాయా? అంటే మెజార్టీ ప్రజానీకం నుంచి ఔననే సమాధానం వినిపిస్తోంది. ముఖ్యంగా పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో ఈ రకమైన రాజకీయ వికట విన్యాసాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ప్రభుత్వ ఖర్చుతో వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ప్రచారం సాగిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో గెలిచేవరకే పార్టీ ప్రతినిధి. గెలిచాక రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించాల్సివస్తుంది. ఆ అధికారం ఉన్నంత వరకూ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడాలే తప్ప, తాను ప్రతినిధ్యం వహిస్తున్న పార్టీకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడే విధంగా వ్యవహరించడానికి వీలు లేదు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రం ప్రభుత్వం 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ మూడు రోజుల క్రితం చేపట్టిన విషయం విధితమే. 15రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఉత్సవంలా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ముందు రోజే ఊరంతా చాటింపులు వేస్తున్నారు. సచివాలయాల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నారు. టెంట్లు, కుర్చీలు సమకూర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాల కంటే వైసిపి, ముఖ్యంగా సిఎం జగన్ కోసమే ఎక్కువ ప్రచారం చేపడుతున్నారు. ఇది ఈనెల 23వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రచార పర్వం ముగుస్తున్న గ్రామాల్లో 'ఎపికి జగనన్నే సిఎం ఎందుకు కావాలి' అంటూ మరో కార్యక్రమం తలపెట్టారు. ఇందులో భాగంగా గ్రామ గ్రామాన ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటింటికీ వాలంటీర్లు వెళ్లి వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ గెలుస్తేనే మేలు జరుగుతుందన్నట్టుగా చెబుతున్నారు. కాదు... కాదు... అలా ప్రభుత్వం వాలంటీలర్లతో బలవంతంగా చెప్పిస్తోంది. ఈ మొత్తం ప్రచార హోరులో వాలంటీర్లతోపాటు సచివాలయ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయడం గమనార్హం. ప్రభుత్వ వైఖరిపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్న సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు మాత్రం మాకేంటీ ఖర్మ అంటూ తూతూ మంత్రంగానే ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ మొత్తం కార్యక్రమానికి మండల స్థాయిలో ఇఒపిఆర్‌డిని నోడల్ ఆఫీసర్‌గా నియమించడం పట్ల కూడా అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తమౌతోంది. ఎంతకి అధికారం ఉంటే మాత్రం ప్రభుత్వ అధికారులు, సిబ్బందిని పార్టీకోసం ఇంతలా వాడుకోవడమా? అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మరోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇదే పద్ధతిలో వ్యహరిస్తోంది. ఈనెల 15వ తేదీ నుంచి 'వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు సన్నద్ధమైంది. దేశవ్యాప్తంగా గిరిజనులు నివసిస్తున్న 110 జిల్లాలో తొలి విడతగా ఈ యాత్ర నిర్వహించేందుకు పథకం రూపొందించింది. ఈ కార్యక్రమం రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి శ్రీకారం చుట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే మండలాల వారీగా యాత్ర షెడ్యూల్ కూడా ఖరారైంది. ఇందులోనూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తామని ప్రభుత్వం బటయకు చెప్తున్నప్పటికీ, గిరిజన ప్రాంతంలో ఎన్నికల అజెండాలో భాగంగానే ఈ యాత్ర సాగుతుందని పలువురు విశ్లేషిస్తున్నారు. పోడు భూములపై గిరిజనులకు హక్కు కల్పించే అటవీహక్కుల చట్టాన్ని సరిగా అమలు చేయలేదు సరికాదా, తిరిగి ఆ చట్టానికి తూట్లు పొడుస్తున్న బిజెపి ప్రభుత్వం గిరిజనులను మాయ మాటలతో నమ్మించి, వచ్చే ఎన్నికల్లో మరోసారి రాజకీయంగా లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తోందని గిరిజన సంఘం, సిపిఎం తదితర ప్రగతిశీల శక్తులు చెబుతున్నాయి. ఇందుకనుగుణంగా గిరిజనులకు రక్షణ కవచంగా వున్న 1/70 చట్టం బిజెపి అధికారంలోకి వచ్చాక నీరు గారుసోతంది. ఇటువంటివన్నీ కప్పిపుచ్చుకనేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నారని పలువురు వాఖ్యానిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికార దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా, ప్రభుత్వ సొమ్ముతో పార్టీ ప్రచారాలు చేసుకుంటున్నాయని జనం అంటున్నారు.

మంత్రి బొత్సకు గుండె శస్త్రచికిత్స

ప్రజాశక్తి–విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండె శస్త్రచికిత్స జరిగింది. ఇటీవల శృంగవరపుకోటలో జరిగిన వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్రలో ఆయన అస్వస్థత గురయ్యారు. వెంటనే ఆయనను విశాఖ తరలించగా, గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బొత్సను హైదరాబాద్ తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని సూచించారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆపరేషన్ జరిగింది. నెల రోజుల వరకు హైదరాబాద్ ఆసుపత్రిలోనే విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది.

బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

'చెకుముకి' విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని నిండుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. గెలిపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. బొబ్బిలి గాయత్రీ జూనియర్ కళాశాల డైరెక్టర్ డి. రమణ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ నేర్చుకుంటే వాళ్ళకు ఉండే టాలెంట్‌ను బయటకు వెలుగు తీసేందుకు ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పోటీ పరీక్షలలో విద్యార్థులు నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. ఈ పరీక్షలలో విజయం సాధించిన విద్యార్థులకు మండల జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్ట్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శివంనాయుడు, జనవిజ్ఞాన వేదిక నాయకులు వి రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తున్న వైకెపి సిబ్బంది

ఇప్పగూడలో చిత్రలేఖనంపై శిక్షణ

ప్రజాశక్తి– సీతంపేట

మండలంలో పి.పి.ఈతమానుగూడ పంచాయితీ పరిధిలో ఇప్పగూడ గ్రామంలో వైకెపి ఆధ్వర్యంలో ఆదివాసి చిత్రలేఖనం (ఇడీసింగ్) కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శనివార ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్ సవర మోహన్ రావు చిత్రలేఖనంపై మెలుకువలు తెలిపారు. క్లాత్‌లో ఫాబ్రిక్ పెయింట్‌తో బొమ్మలు ఎలా వెయ్యాలన్నది వివరించారు. ఈ శిక్షణకు 3 మండలాల నుండి 30 మంది పాల్గొన్నారు. సిఒ బి. వెన్నెల మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు, చిత్రలేఖనం విశిష్టత గురించి శిక్షణలో వివరించారన్నారు. ఈ శిక్షణలో వైకెపి సిబ్బంది మిన్నారావు, కోఆర్డినేటర్ పాలక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి – గరుగుబిల్లి

ఈనెల 14 నుంచి నిర్వహించనున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి నల్ల మధుసూదనరావు తెలిపారు. ఈ మేరకు శనివారం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన బ్యానర్లను ఏర్పాటు చేశారు. గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం రోజున పుస్తక ప్రదర్శనఉంటుందన్నారు. 19న "దిశా చట్టం" మహిళా సాధికారత అన్న అంశంపై అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, చదరంగం, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామనిగ్రంథాలయ నిర్వాహకులు మధుసూదనరావు వెల్లడించారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపితోనే సంక్షేమ పాలన

ప్రజాశక్తి– సాలూరు

వైసిపి ప్రభుత్వం హయాంలోనే పేదలకు సంక్షేమ రాజ్యం సాధ్యమైందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు చెప్పారు. జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా వారు పెదపదం సచివా లయం పరిధిలో ఇంటింటికీ తిరిగి అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. నవరత్నాలనే సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి సుకన్య, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

అదుపులో ఇద్దరు వ్యక్తులు

సీతానగరం: మక్కువ మండలం సన్యాసిరావుపేటలో ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోగా, అలాగే సీతానగరం మండలంలో 9 అక్రమ మద్యం బాట్లను స్వాధీనం చేసుకొని మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఇద్దర్ని కోర్టులో హాజరు పరిచ్చినట్లు సీతానగరం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు, నాటుసారా అమ్మకాలు ఎవరైనా నిర్వహిస్తే సమాచారం తక్షణమే తెలియజేయాలన్నారు. వివిధ కేసుల్లో నమోదైన పాత నేరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ వారి ఆధ్వర్యంలో సీతానగరం ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోస్టేషన్ వద్ద ఈనెల 14న వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు స్థానిక స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన ఓ వ్యాపారి అనుమతులు లేకుండా టపాసులు విక్రయాలు జరిపినందుకు శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులూ లేకుండా గ్రామాల్లో మందు గుండు సామాగ్రి అమ్మితే అరెస్టు చేస్తామన్నారు.

9 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

మండలంలోని బూరాడ గ్రామ చెరువు సమీపంలో శనివారం సాయంత్రం పేకాడుతున్న 9 మంది జూదగాళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. వీరి నుంచి రూ.59,999 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మొక్కజొన్న రైతుకు కత్తెర పోటు

● ఉధృతంగా వ్యాపిస్తున్న పురుగు
● ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి – మక్కువ

ప్రస్తుత రబీ సీజన్లో మొక్కజొన్న రైతుకు ఆది నుండే కష్టాలు ఎదురయ్యాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. పంట ఎదుగుదలకు వచ్చి 15 రోజులు కాకముందే కత్తెర పురుగు ఆశించి మొక్కజొన్న రైతులను అవస్థలకు గురిచేస్తుంది. ఇప్పటివరకు మండలంలో దాదాపు వందెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తుండగా మరికొన్ని ఎకరాల్లో ఇంకా విత్తనాలు వేయాల్సి ఉంది. ఇప్పటికే ఆరుతడి పంటలకు అవసరమైనంత వర్షం పడకపోవడంతో ఓవైపు ఎండిపోతున్న పంటను చూసి ఆందోళన చెందుతుంటే మరోవైపు చీడపీడల బెడదతో రైతులు అల్లాడిపోతున్న పరిస్థితి ఏర్పడింది. మొక్కజొన్న ఎదుగుదలకు వస్తున్న తరుణంలో కత్తెర పురుగు సోకి కోలుకోని దెబ్బతీస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన చేయూత అందడం లేదని మొక్కజొన్న రైతులు అంటున్నారు. ఆరుతడి పంటలకు సంబంధించిన ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

నివారణ ఇలా...

ప్రస్తుత రబీ కాలంలో మొక్కజొన్న సాగు వడివడిగా సాగుతుందని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు మొక్కజొన్న పంటలపై కత్తెర పురుగు ఆశించిందన్న అంశంపై 'ప్రజాశక్తి' ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తెర పురుగును నివారించవచ్చన్నారు. ఎకరాకు అరకిలో వేపనూనెలో వంద గ్రాముల ఇమోమెట్ బెంజోయేట్‌ను కలిపి కత్తెర పురుగు ఆశించిన పంటలపై పిచికారీ చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆరుతడి పంటలకు సంబంధించి

కత్తెర పురుగు నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ఎరువులు పురుగుల మందులు సబ్సిడీలు రాలేదని ఆయన తెలిపారు

గతంలో సబ్సిడీ ఉండేది..

గత ప్రభుత్వ హయాంలో మొక్కజొన్న పంటలకు ఆశించే కత్తెర పురుగు నివారణకు సబ్సిడీపై వేప నూనె ఇమామేట్ బెంజోయేట్ పురుగుమందు ఉండేదని రైతులు అంటున్నారు. 65 రూపాయలకే 100 గ్రాముల హిమాయత్ బెంజో ఎట్ పురుగుమందు లభించేదని, ప్రస్తుతం అదే మందు 100 గ్రాములు సుమారు రూ.270కు కొనాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న ప్రారంభం నుండి పంట కోత వరకు సుమారు మూడు సార్లు ఈ మిశ్రమాన్ని వినియోగించాల్సి ఉంటుందని వారు తెలిపారు. దీంతో తమపై ఎంతో ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్సిడీతో వీటిని పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

కత్తెర పురుగు నివారణకు అగ్ని అస్త్రం

పాచిపెంట : మొక్కజొన్న నాటిన పది రోజుల నుండే కత్తెర పురుగుకు గురవుతుందని, దీని నివారణకు అగ్ని అస్త్రం తయారు చేసుకుని పిచికారీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనుతో కలిసి మొక్కజొన్న పంటను శనివారం పరిశీలించారు. అనంతరం సిఆర్‌పి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో కత్తెర పురుగు నివారణకు అగ్ని అస్త్రం తయారీని రైతులకు వివరించారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మొక్కజొన్న నాటిన పది రోజుల నుండి కత్తెర పురుగు ఆశిస్తుందని,ప్రస్తుత రబీ సీజన్లో ఈ పురుగు చాలా ఉధృతంగా ఉందని అన్నారు. పంట మార్పిడి లేకుండా ప్రతి సీజన్లోనూ మొక్కజొన్న పంటను వేస్తున్న క్షేత్రాల్లో ఈ పురుగు ఉధృతి మరింత ఎక్కువగా ఉందని అన్నారు. దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్, వేపనూనెతో పాటుగా అతి ఖరీదైన డెలిగేట్, కొరాజన్ వంటి మందులను రైతులు వినియోగిస్తున్నారని అన్నారు. దీనివల్ల ఒకసారి పిచికారీకి ఎకరాకు రూ. 1500 వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అదే కత్తెర పురుగును ముందుగానే గుర్తించి ప్రకృతి సేద్య పద్ధతుల్లో అగ్ని అస్త్రం పిచికారీ తక్కువ వ్యయంతో అరికట్టుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో రైతులు ఐ సి ఆర్ పి లు పాల్గొన్నారు

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి –భామిని

లబ్దిదారులను గర్తించి పారదర్శకంగా వారి ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తున్నదని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని బాలేరు సచివాలయం –2 పరిధిలో గల నల్లారాయిగూడ, ఇసుకగూడ, సన్నాయిగూడ, డోకులగూడ, కారిగూడ, లక్ష్మీపురం, రేగిడి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బుక్లెట్‌ను లబ్దిదారులకు అందించారు. పూర్తిస్థాయిలో పథకాలు అందాయా, లేదానని ఎంఎల్ఎ అడిగారు. గ్రామంలో ఏమైనా సమస్యలున్నాయా అని ఎంఎల్ఎ మహిళలను ప్రశ్నించగా తమ ప్రాంతంలో కాలువలు నిర్మించి, మురుగు సమస్యలు లేకుండా చూడాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం,

పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

జెసిఎస్ కో–ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి నాయకులు కొత్తకోట ఆంజనేయులు, మెడిబోయిన చలపతి, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, నల్లారాయిగూడ సర్పంచ్ బిడ్డిక గొయంతి, కొండగొర్రి భాస్కరరావు, బిడ్డిక నూకయ్య, అరిక పుష్ప, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..?

ప్రజాశక్తి – వీరఘట్టం

బోర్డుపైన జిల్లా పేరు మార్చడానికి ఇంత నిర్లక్ష్యమా? అంటూ అధికారుల తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. మండలంలోని హుస్సేన్‌పురం సచివాలయ కార్యాలయానికి ఏర్పాటు చేసిన నేమ్ బోర్డులో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 2022 ఏప్రిల్ 4న జిల్లాలను విభజించిన విషయం తెలిసినదే. శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా నుంచి పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పాటైంది. జిల్లాలను విస్తరింప చేసి దాదాపుగా 19 నెలలు కావస్తున్నప్పటికీ జిల్లా పేరు మార్పు చేసేందుకు సచివాలయ అధికారికి తీరుకు లేదా అంటూ స్థానికులు పెద్ద ఎత్తున విమర్శలు కురిపిస్తున్నారు. మండల స్థాయి అధికారులకు సచివాలయానికి ఆకస్మిక తనిఖీలకు వెళ్లినప్పుడు నేమ్ బోర్డు కూడా కనిపించలేదంటూ ఎద్దేవా చేస్తున్నారు. అలాగే వీరఘట్టంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమం బాలురు వసతిగృహం బోర్డుపైన కూడా జిల్లా పేరు మార్చలేదు. పార్వతిపురం మన్యం జిల్లా బదులు ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాగానే బోర్డులు దర్శనమిస్తున్నాయి. వీటిని చూస్తే అధికారులు పనితీరు ఏవిధంగా ఉందో స్పష్టంగా అర్థం చేసుకో వచ్చును.

శ్రీకాకుళం జిల్లా పేరతో ఉన్న సచివాలయం బోర్డు

బహిరంగసభను జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి – కొమరాడ

అసమానతలు లేని రాష్ట్రం, జిల్లా అభివృద్ధి కోసం ఈనెల 15న విజయవాడలో జరిగే సిపిఎం ప్రజారక్షణభేరి ముగింపు బహిరంగ సభకు భారీగా ప్రజలు కదిలి రావాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు కూనేరు సంత, అంటివలసలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ రేట్లు తగ్గించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. దళితులకు, గిరిజనులకు రావలసిన నిధులు కేటాయించాలని, పగ్బందీగా అమలు చేయాలని కోరారు. జిల్లాలోని నీటి ప్రాజెక్ట్ పనులు వెంటనే పూర్తి చేసి పంటలకు సాగునీరందించాలని, ఈ సమస్యలు పరిష్కరించే దిశగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రక్షణ బేరి పేరుతో

ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

బస్సుయాత్ర జరిగిందని తెలిపారు. ఈ బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో ప్రజా రక్షణ బహిరంగ సభ జరుగుతుందని, కావున కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ ప్రచారంలో సిపిఎం నాయకులు ఉపేంద్ర, లక్ష్మణరావు, వెంకట్రావు, అప్పారావు, లచ్చుము, పోలినాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

జెఎఎస్‌తో గిరిజనుల ముంగిటకే వైద్యం

'ప్రజాశక్తి'తో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె.విజయ పార్వతి

ప్రజాశక్తి – సీతంపేట

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల గిరిజనుల ముంగిట్లోకే వైద్యం అందుతుందని, నాణ్యమైన వైద్యంతో ఉచితంగా పాటు వైద్యపరీక్షలు, మందులు కూడా అందిస్తున్నట్టు ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె.విజయ పార్వతి అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు 32,798 మందికి వైద్యపరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలకు 896 మందిని రిఫర్ చేశామని చెప్పారు. ఈ వైద్యశిబిరాలకు ప్రతి రోజూ సుమారు 400 నుండి 500కు పైగా రోగులు వస్తున్నారని చెప్పారు. వీరికి తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో పాటు స్పెషలిస్ట్‌లతో కూడా తనిఖీలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో గల మర్రిపాడు, దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్‌నర్సుల కొరత ఉందని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా మన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం కూడా పగడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వైద్యులను, సిబ్బందిని అప్రమత్తం చేసి గిరిజనులకు సకాలంలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు.

విజయపార్వతీ

టీకా కార్యక్రమం పరిశీలన

ప్రజాశక్తి– సీతానగరం

మండలంలో పాపమ్మవలస, నీలకంఠాపురం గ్రామాల్లో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకా అర్హులైన పిల్లలు, గర్భిణుల వివరాలు, గడువు తేదీలను ఆర్సిహెచ్ రిజిష్టర్, టీకా కార్డుల్లో పరిశీలించారు. వ్యాక్సిన్ స్థితి (వివిఎమ్), కాల పరిమితి తనిఖీ చేశారు. గ్రామంలో ఉన్న ఐదేళ్ళ లోపు పిల్లలకు సకాలంలో టీకా వేయడం జరిగిందా అని, ఎవరైనా డ్రాప్‌అవుట్స్, లెఫ్ట్ అవుట్స్ ఉంటే గుర్తించి టీకా పూర్తి చేయాలని సూచించారు. టీకాలు వేయడం పూర్తయిన వెంటనే ఆ వివరాలు యూవిన్, ఆర్‌సిహెచ్ పోర్టల్స్‌లో ఆన్‌లైన్ నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. టీకాలు వేయడం వల్ల ఉపయోగాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. పిల్లలకు ఐరన్ సిరప్‌ను వారానికి రెండు సార్లు ఒక ఎమ్ఎల్ ద్రావణం చొప్పున తప్పకుండా వేయించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎదుగుదల నమోదు రికార్డులు పరిశీలించారు. పిల్లలు పౌష్ఠికాహారం సరిగా తీసుకునేలా చూడాలన్నారు. శీతాకాలం కారణంగా పిల్లల్లో శ్వాస సంబంధమైన సమస్యలు గుర్తిస్తే వెంటనే తగు చికిత్స అందజేసి పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎమ్‌లు చైతన్య, జయలక్ష్మి, సిహెచ్‌ఒ సంధ్యారాణి, అంగన్వాడీ సిబ్బంది సత్యవతి, శకుంతల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఐఒ జగన్‌మోహన్‌రావు

రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాలలు ఎంపిక

సీతానగరం : 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న రెండు పాఠశాలలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినిలు నవ్యశ్రీ, జ్యోత్స్నలతో పాటు బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హరిణిశ్రీ, హరితలు రూపొందించిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. జిల్లాలో ఏడు ప్రాజెక్టులు ఎంపిక కాగా అందులో మండలం నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే జోగారావు, మండల ప్రజా ప్రతినిధులతోపాటు స్థానిక నాయకులు, ఎంఇఒ సూరిదేముడు, వెంకట రమణలు హర్షం వ్యక్తం చేసి వారికి అభినందనలు తెలిపారు. తమ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికపట్ల ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మీసాల సన్యాసి నాయుడు, జొన్నాడ సంధ్య, సర్పంచులు జి. దాసు, కె. సింహాచలం పిల్లలను, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు.

విజేతలకు బహుమతులిస్తున్న నిర్వాహకులు

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి – భామిని

మండలంలోని దిమ్మిడిజోల్ గ్రామానికి చెందిన కేవటి గోపాలకృష్ణ గతంలో కరెంటు షాక్‌కి గురై ఒక కాలు, ఒక చేయి పోగొట్టుకుని ఉపాధి లేక, అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి, సిఎం జగన్ దృష్టికి తీసుకివెళ్లారు. దీనికి స్పందించిన ఆయన సిఎం సహాయ నిది నుండి రూ.4 లక్షలు మంజూరు చేశారు. ఈ నగదును చెక్కు రూపంలో శనివారం కేవటి గోపాల క్రిష్ణకు ఎమ్మెల్యే అందించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిమ్మల పున్నయ్య ఇంటికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అండంగా ఉంటానని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి నాయకులు కాగితపల్లి క్రిష్ణ, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఉపాధ్యాయ ఫెడరేషన్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలి

వీరఘట్టం: స్టేట్ కౌన్సిల్లో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ ఫెడరేషన్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని రాష్ట్ర మీడియా కన్వీనర్ ఎ.వెంకట్రావు శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ పునర్దించాలని, అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జెఎల్ ప్రమోషన్ ఇవ్వాలని, ప్రతి హై స్కూల్‌కు జూనియర్ అసిస్టెంట్ పోస్టు మంజూరు చేయాలని, వివిధ శాఖలలో ఉన్న బ్యాక్లాగ్ పోస్టుల ఖాళీలను ప్రకటించి నియమకాలు జరపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయడానికి మెగా డిఎస్‌సి నిర్వహించాలన్నారు. విలీన టీచర్లకు సర్వీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని, ఎస్‌సి, ఎస్‌టి ప్రమోషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పక్కాగా అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్లకు రావలసిన డిఎ, పిఎఫ్, జిపిఎస్, ఎపి జిఎల్ఐసి, సరండర్ లీవ్ పెండింగ్ బకాయిలను చెల్లించాలన్నారు. 2023 జులై నుండి 12వ పిఆర్‌సికి సంబంధించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు.

బ్రహ్మకుమారీస్ విద్యాలయానికి 31 ఏళ్లు పూర్తి

సాలూరు: పట్టణంలో ఈశ్వరీయ బ్రహ్మ కుమారీ విద్యాలయం స్థాపించి 31 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా శనివారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. విద్యాలయం ఉమ్మడి జిల్లా ఇంఛార్జి బికె అన్నపూర్ణ, సాలూరు బ్రాంచి ఇన్‌ఛార్జి బికె రత్న కేక్ కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు గంటా వెంకటరాజు విద్యాలయం సేవలను కొనియాడారు.

పలు గ్రామాల్లో టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి – సీతంపేట

మండలంలోని కొత్తకోటలో పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను వివరిస్తూ ఖచ్చితంగా ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబునాయుడు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, సర్పంచ్ బిడ్డిక అప్పారావు, మాజీ సర్పంచ్ బిడ్డిక స్వామినాయుడు, ఐటీడీపి కోఆర్డినేటర్ హిమరక పవన్, నాయకులు మండంగి ప్రకాశం, నిమ్మక ఆనంద్, సవర సోడంగి,ఆరిక సువర్ణ,ఆరిక వరలక్ష్మి, మూటక నరసింహులు, మండంగి భూషణ్, గ్రామ పెద్దలు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేటం : మెనిఫెస్టోను పంపిణీ చేస్తున్న పడాల భూదేవి

భూ దేవి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

మండలంలోని మైదాన ప్రాంతాలతో పాటు ఎత్తైన కొండ ప్రాంతాల్లో కూడా టిడిపి నాయకులు పడాల భూదేవి శనివారం టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. మండ పంచాయతీ పరిధిలో ఎగువ బుడగరాయి, మధ్య బుడగరాయి, దిగువ బుడగరాయి గ్రామాల్లో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టోలో ఉన్న సంక్షేమ పథకాలు గూర్చి వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమతం దన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ ముందుకు తీసికెళ్ళే సత్తా ఆయనతోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతూ యువత భవిష్యత్తుకు భరోసా ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం మండలంలోని ఒబ్బంగి పంచాయతీలోని తియ్యాలి, లిక్కిడి, లిక్కిడిగూడ, కాకిలి గిరిజన గ్రామాల్లో బాబుష్యూరిటీ –భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో గురించి వివరించి రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా టిడిపి పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అప్పుడే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని అన్నారు. ఇప్పటికే వైసిపి ప్రభుత్వంపై ప్రజలు నిరాశతో ఉన్నారని కచ్చితంగా రాన్నున ఎన్నికల్లో వైసిపికి బుది చెబుతారని చెప్పారు. జనసేన, టిడిపి పొత్తులో కచ్చితంగా తాము విజయం సాధిస్తామని ఆశా భావం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడ సమస్యలను గిరిజనులతో మాట్లాడి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తామని జగదీశ్వరి గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శంకరరావు, భారతి, ప్రదీప్ పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి రైతులను నట్టేట ముంచేలా వ్యవహరించడం బాధాకరమని, పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని రావికోన లో భవిష్యత్తు కు బాబు ష్యూర్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాలు సాగునీటి ఎద్దడితో వరి పంట ఎండిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసిపి ఎమ్మెల్యే బస్సు యాత్రల పేరిట ప్రజలను మభ్యపెట్టేందుకు సమయాన్ని కేటాయిస్తున్నారు తప్ప రైతులను పట్టించుకోవడంలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జిల్లాలోని కరువు పరిస్థితులను అంచనా వేసి, నిధుల నష్టాన్ని గమనించి కరువు మండలాలుగా ప్రకటించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొరజాన చంద్రమౌళి, కార్యదర్శి చంద్రమౌళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : మాట్లాడుతున్న తోయక జగదీశ్వరి